ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5





ముస్తాబైన కెంగేరీ బండేమఠ శివాలయం

శంభో..శంకరా..!

మహాశివరాత్రి వేడుకలకు రాష్ట్రంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం అభిషేకాలు, అర్చనలు, జాగరణకు భక్తులు సిద్ధమయ్యారు..





గెలుపు గుర్రాల కోసం అన్వేషణ

- లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీల్లో మొదలైన అభ్యర్థుల ఎంపిక
- బీజేపీ నేతలతో అమిత్‌షా సమీక్ష.. దాదాపు ఖరారు
- త్వరలో రెండో జాబితా..
- కాంగ్రెస్‌లోనూ అదే జోరు..
- అధిష్టానానికి చేరిన 15 మంది జాబితా..!
- వలస నేతలకే ప్రాధాన్యం

బెంగళూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేందుకు మరో వారం రోజులు మాత్రమే గడువు ఉన్న తరుణంలో అభ్యర్థుల ఎంపికలో పార్టీలు తలమునకలవుతున్నాయి. బీజేపీ అధిష్టానం అభ్యర్థుల ఎంపికను వేగవంతం చేసింది. ఇటీవల విడుదల చేసిన తొలిజాబితాలో రాష్ట్రానికి సంబంధించి ఒకరి పేరు కూడా ఖరారు కాలేదు. ఇక రెండోజాబితా ఎప్పుడైనా విడుదల కావచ్చు అనే అభిప్రాయాలు ఉన్న తరుణంలోనే రాష్ట్ర నేతలతో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బుధవారం చర్చలు జరిపిన అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యింది. సిట్టింగ్‌లకు టికెట్‌లు ఇచ్చే విషయమై రాష్ట్ర నేతల అభిప్రాయాలను తెలుసుకున్నట్లు తెలుస్తోంది. బుధవారం సుదీర్ఘంగా ఐదుగంటలకు పైగానే ఢిల్లీలో అభ్యర్థుల ఖరారుకు సంబంధించి సమీక్ష జరిగింది. ఇందులో రాష్ట్రానికి సంబంధించిన విషయం కూడా కీలకంగా ఉంది. సిట్టింగ్‌లకు సంబంధించి నేతలు అమిత్‌షా, జేపీనడ్డాలు రాష్ట్ర నాయకులతో చర్చలు జరిపిన వేళ మీ అభిప్రాయాలు తెలపండి టికెట్‌ల విషయం మే నిర్ణయిస్తామని తేల్చి చెప్పారని నేతలు గుసగుసలాడుతున్నారు. ఈమేరకు సిట్టింగ్ ఎంపీలకు సంబంధించిన సమగ్ర నివేదికను సమర్పించారు. 28 నియోజకవర్గాలకు సంబంధించి 25మంది బీజేపీ ఎంపీలు ఉండగా ఇండిపెండెంట్ ఎంపీ సుమలత కూడా బీజేపీ మద్దతుదారులిగా ఉన్నారు. దీంతో 26 మంది ఎంపీలు కలిగిన రాష్ట్రం నుంచి వచ్చే ఎన్నికలలోనూ ఎక్కువ సీట్లు సాధించే దిశగా సుమారు ఆరేడుసార్లు సర్వేలు జరిపారు. సిట్టింగ్ ఎంపీలకు సంబంధించి వ్యతిరేకత, పాజిటివ్‌ల విషయాలను పరిగణలోకి తీసుకుంటామని ఆయన సూచించారు. అమిత్‌షా ఇటీవల జరిపిన మూడు సర్వేల ద్వారానే అభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వీటిలో పార్టీ జరిపించిన సర్వే ఒకటి కాగా అమిత్‌షా స్వయంగా తన బృందాల ద్వారా జరిపించిన మరో సర్వే నివేదికతో పాటు రాష్ట్ర నాయకులు సూచనల నివేదికలకు అనుగుణంగానే చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఎంపీల వ్యక్తిగత తీరు, మరోసారి టికెట్ ఇస్తే అనుకూలం కానుందా.. వ్యతిరేకమా అనే కాకుండా ప్రత్యర్థి ఎవరవుతారనే సామాజిక కోణంలోను సమీక్ష జరిపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీలకు వ్యతిరేకత ఉంటే కార్యకర్తల నుంచా లేక ప్రజల నుంచి ఉందా లేక రాష్ట్ర పార్టీ నాయకులతోనా అనే కోణంలోను చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఐదు నియోజకవర్గాలపై సుదీర్ఘంగానే సమీక్ష జరిపినట్లు సమాచారం. వీటిలో బీదర్, బెళగావి, హావేరి, దావణగెరె, చిక్కబళ్ళాపురలు ఉన్నాయి. బీదర్ ఎంపీ, కేంద్రమంత్రి భగవంత్‌ఖూబాపై తీవ్రమైన వ్యతిరేకతపై చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. నియోజకవర్గ ఎమ్మెల్యేలు సైతం వ్యతిరేకంగా ఉన్నారనే విషయంతో రెండో ఎంపికగా గురునాథ్ కొళ్ళూర్ పేరు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. బెళగావి ఎంపీ మంగళా అంగడి అత్యల్ప మెజారిటీతో గెలుపొందిన మేరకు ఆమెను మార్పుచేయాలని తీర్మానించినట్లు సమాచారం. బెళగావి నుంచి జగదీష్‌శెట్టర్‌ను అభ్యర్థి చేయడం సముచితమని రాష్ట్రనాయకులు సూచించడంతో అతడి విషయం మాకు వదిలిపెట్టండి అంటూ సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. దీంతో బెళగావికి అభ్యర్థి ఎవరనేది మరో ఉత్కంఠ మొదలయ్యింది. ఇక హావేరి ఎంపీ శివకుమార్ ఉదాసీ పోటీ చేసేందుకు ఆసక్తి చూపకపోవడంపై మాజీ సీఎం బసవరాజ్‌బొమ్మై పేరు ప్రస్తావనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక దావణగెరె ఎంపీ జీఎం సిద్దేశ్వర్‌ను మార్పు చేయాలని సీనియర్‌నేత రేణుకాచార్య తీవ్రమైన ఒత్తిడి చేస్తున్న విషయం కూడా ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక్కడ ప్రత్యర్థి శ్యామనూరు కుటుంబీకులే ఉంటారనే అంశంపై కూడా చర్చ సాగినట్లు సమాచారం. ఇక చిక్కబళ్ళాపుర ఎంపీ బచ్చేగౌడ దాదాపు కాంగ్రెస్‌తో కలిసిపోయారు. ఆయనకు టికెట్ ఇచ్చేది ఉండదు పైగా ఆయన పోటీ చేసేందుకు సుముఖంగా లేనని ప్రకటించుకున్నారు. ఈస్థానం నుంచి బీజేపీ అభ్యర్థి బరిలో ఉంటారనేది స్పష్టమవుతోంది. మాజీ మంత్రి డాక్టర్ సుధాకర్ రేసులో ఉన్నారు. ఆయన ఇప్పటికే ఢిల్లీ నేతలతో ఒక విడత చర్చలు జరిపారు. అతడితో పాటు అలోక్‌విశ్వనాథ్ పేరు ప్రస్తావనలో ఉంది. జేడీఎస్ కు రెండు లేదా మూడు సీట్లు ఇచ్చే అవకాశం ఉంది. అందులో హాసన్, మండ్యలు దాదాపు ఖరారు కాగా మూడో స్థానంగా బెంగళూరు గ్రామీణగా అభిప్రాయాలు ఉన్నాయి. కాగా 28 నియోజకవర్గాలకు సంబంధించి సమీక్ష జరిగినట్లు సీనియర్‌నేత యడియూరప్ప ఢిల్లీలో మీడియాకు తెలిపారు. అయితే ఇంకా సీట్లు ఖరారు కాలేదన్నారు. బీజేపీ రెండోజాబితాలో రాష్ట్రానికి సంబంధించి దాదాపు సగానికి పైగానే తేలిపోనున్నట్లు సమాచారం. కాగా సిట్టింగ్‌లలో 11మందికి టికెట్‌లు ఉండవనేది దాదాపు స్పష్టమవుతోంది.

కాంగ్రెస్‌లో వలస నేతలకే ప్రాధాన్యం..

బెంగళూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లోనూ టికెట్ల సందడి మొదలయ్యింది. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ మరో వారంలో వెలువడుతుందనే ప్రచారం నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు అభ్యర్థుల జాబితాను దాదాపు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. 15 స్థానాలకు ఒకే పేరుతో ఢిల్లీ పెద్దలకు పంపినట్లు తెలుస్తోంది. ఇక కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరి కొంత కాలం అధికారంలో ఉంటూ ప్రస్తుతం మరోసారి సొంతగూటికి వచ్చేందుకు సిద్ధమైన ఎస్‌టీ సోమశేఖర్‌తో పాటు పలువురి పేర్లు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. బెంగళూరు గ్రామీణకు ఏకైక సిట్టింగ్ డీకే సురేష్‌తో పాటు మైసూరు నుంచి సీఎం కుమారుడు యతీంద్ర సిద్ధరామయ్యల పేర్లు ఖరారైనట్లు తెలుస్తోంది. మండ్య నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా పారిశ్రామిక వేత్త స్టార్ చంద్రు పేరును తేల్చినట్లు తెలుస్తోంది. తుమకూరుకు ముద్దహనుమేగౌడ పేరు సిఫారసు చేయగా ఢిల్లీలో అధికార ప్రతినిధి టీబీ జయచంద్ర కుమారుడు సంతోష్ కోసం ఇంకా ఆశలు వదులుకోలేదు. చిక్కబళ్ళాపుర నుంచి మరోసారి వీరప్పమొయిలీ ప్రయత్నిస్తుండగా జీ-23 బృందంలో ఉండటం ఆయనకు వెనకడుగుగా ఉన్నట్లు తెలుస్తోంది. యూత్‌కాంగ్రెస్ నాయకుడు రక్షా రామయ్య పేరు ఉంది. బెంగళూరు సెంట్రల్ నుంచి శాంతినగర్ ఎమ్మెల్యే ఎన్ఎ హ్యారిస్ పేరు ప్రధానంగా ఉండగా ఖాళీగా ఏర్పడే శాంతినగర్ నుంచి కుమారుడు మహమ్మద్ నల్పాడ్‌కు ఇవ్వదలచినట్లు తెలుస్తోంది. కోలార్ నుంచి మరోసారి మంత్రి మునియప్ప పోటీకి సిద్ధమయ్యారు. ఒక వేళ ఎంపీగా గెలుపు సాధిస్తే దేవనహళ్ళి నుంచి కుటుంబీకులలో ఒకరికి ఇస్తారనే ప్రచారం ఉంది. కోలార్ నుంచి మల్లికార్జునఖర్గే అష్టుడు డాక్టర్ బీసి ముద్దుగంగాధర్ పేరు ప్రస్తావనలో ఉంది. ఉత్తరకన్నడ నుంచి బీజేపీ రెబల్ ఎమ్మెల్యేగా మారిన శివరామహెబ్బార పేరు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది., ఇక ఇదే స్థానానికి మాజీ మంత్రి అంజలీనింబాళ్కర్ కూడా ప్రయత్నిస్తున్నారు. డాక్టర్ సుధాకర్ చిక్కబళ్ళాపుర బీజేపీ అభ్యర్థి కోసం ప్రయత్నిస్తుండగా సాధ్యం కాకుంటే కాంగ్రెస్ నుంచి బెంగళూరు ఉత్తర అభ్యర్థి అవుతారనే ప్రచారం ఉంది. బెంగళూరు దక్షిణకు సౌమ్యారెడ్డి, చిత్రదుర్గకు బీఎన్ చంద్రప్ప, బీదర్‌కు రాజశేఖర్ పాటిల్, విజయపురకు మాజీ ఎమ్మెల్యే రాజు అలగూరు, హాసన్‌కు శ్రేయస్ పటేల్, శివమొగ్గ నుంచి హీరో శివరాజ్ భార్య గీతా పేరు దాదాపు ఖరారైంది. ఉడుపి- చిక్కమగళూరు నుంచి బీసీ కమిషన్ ఛైర్మన్‌గా ఉండే జయప్రకాష్‌హెగ్డే పేరు దాదాపు ఖరారైంది. పార్టీలో చేరాలని స్వయంగా ఇన్‌ఛార్జ్ సుర్జేవాలా ఆహ్వానించినట్లు తెలుస్తోంది. బాగల్‌కోటెకు ఎమ్మెల్యే విజయానంద కాశెప్ప భార్య వీణా కాశప్ప లేదా మాజీ ఎమ్మెల్యే ఆనందన్యామగౌడులు రాయచూరుకు కుమార్ నాయ్క లేదా రవి పాటిల్‌ల పేర్లు ఉన్నాయి. బళ్ళారికి మంత్రి నాగేంద్రతో పాటు ఎమ్మెల్యే తుకారం కుమార్తె చైతన్య సౌపర్ణిక, మాజీ ఎంపీ ఉగ్రప్పల పేర్లు ఉన్నా యని తెలుస్తోంది.



దాహం.. ఆగ్రహం

- నగరంలో తీవ్రమైన తాగునీటి సమస్య
- రోడ్డెక్కి ప్రజల నిరసన
- ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి
- కావేరి నీటిని పదేపదే తమిళనాడుకు వదలడంతోనే సమస్య తీవ్రం
- బీజేపీ నేతల ఆగ్రహం

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జలం కోసం జనం రోడ్డెక్కారు. నగరంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి తాగునీటి ఎద్దడి ఏర్పడింది. వేసవి తీవ్రత పెరుగుతున్న కొద్దీ రాజధాని నగరంలోని అనేక ప్రాంతాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి కటకట ప్రారంభమైందని యుద్ధప్రాతిపదికన ప్రజల తాగునీటి దాహార్తి తీర్చేందుకు చర్యలు చేపట్టాలని భారతినగర రెసిడెంట్స్ ఫోరం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఫోరం ఆధ్వర్యంలో కాక్స్‌టౌన్ లోని డా.రాజ్‌కుమార్ విగ్రహం ఎదుట గురువారం ప్రముఖ సినీనటి జాతీయ పురస్కార గ్రహీత తారా అనురాధ సారథ్యంలో స్థానికులు ఖాళీకుండలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతినగర్ రెసిడెంట్స్ ఫోరం అధ్యక్షుడు ఎన్ఎస్.రవి మీడియాతో మాట్లాడుతూ వేసవి తీవ్రత ఇంకా ప్రారంభంకాకుండానే నగరంలోని అనేక ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నెలకొని ఉందని ఈ మేరకు సమస్యలను పరిష్కరించాలంటూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు, నగర జిల్లా ఇన్‌చార్జిగా ఉన్న ఉప ముఖ్యమంత్రి డికె.శివకుమార్‌లకు లేఖలు రాశామన్నారు. తాగునీటి ఎద్దడిని ప్రభుత్వం దృష్టికి ధర్నా నిర్వహించామన్నారు.



బీజేపీ విడుదల చేసిన ఫొటో



కాక్స్‌టౌన్‌లో ఖాళీ బిందెలతో ప్రదర్శనలో సినీ నటి అనురాధ

తాగునీటి ఎద్దడిపై బీజేపీ ఆగ్రహం

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాజధానితో తాగునీటి ఎద్దడిపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంకా వేసవి తీవ్రత ప్రారంభం కాకముందే చాలాచోట్ల తాగునీటి హాహాకారాలు ప్రారంభం అయ్యాయని ఆ పార్టీ నేతలు వాపోతున్నారు. తాగునీటి సమస్య ఏర్పడకుండా పలుచర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించినప్పటికీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని బీజేపీ పేర్కొంది. ఇందుకు అద్దంపట్టే ఒక ఫొటోను గురువారం సోషల్‌మీడియాలో పోస్ట్‌చేసింది. బిందెడు నీళ్ళకోసం ప్రజల పాట్లు అంటూ టైటిల్‌తో ఈ ఫొటోను విడుదల చేసింది. కావేరి జలాలను తమిళనాడుకు పదే పదే విడుదల చేయడం వల్లే రాజధానికి ఈ పరిస్థితి దాపురించిందని వ్యాఖ్యానించింది.

9న రైతు సౌరశక్తి మేళా ప్రారంభం

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయేతర ఇంధన వనరులకు ఊతమిచ్చే దిశలో వ్యవసాయ రంగంలో సౌరవిద్యుత్ వాడకాన్ని గరిష్టంగా అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా బెంగళూరు జీకేవీకే ఆవరణలో ఈ నెల 9న రైత సౌరశక్తి మేళాను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య లాంఛనంగా ప్రారంభించనున్నారు. విద్యుత్ శాఖా మంత్రి కేజేజార్జి నగరంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 2008 నుంచి 2023 సెప్టెంబరు 22 వరకు 4 లక్షల అక్రమ వ్యవసాయ పంప్‌సెట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటిలో ప్రస్తుత ఏడాది కుసుమ్-బీ పథకంలో భాగంగా 40వేల పంపుసెట్లకు సౌరవిద్యుత్ కనెక్షన్లను ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇదే సందర్భంగా రాష్ట్రంలోని 13 జిల్లాలలో సబ్ స్టేషన్లకు కూడా శ్రీకారం చుట్టబోతున్నట్లు చెప్పారు. కాగా తమ వ్యవసాయ క్షేత్రాలకు సోలార్ పంప్‌సెట్లను అమర్చుకోవాలనుకునే ఆసక్తిగల రైతుల కోసం ప్రత్యేకంగా సౌరమిత్ర పేరుతో ఆన్‌లైన్‌పోర్టల్‌ను కూడా ప్రారంభించబోతున్నట్లు మంత్రి తెలిపారు. వ్యవసాయ రంగంలో సౌరవిద్యుత్ వాడకాన్ని పెంచడం ద్వా రా విద్యుత్ కొరతను పూర్తిగా అధికగమించాలన్నది ప్రభుత్వ సంకల్పమని మంత్రి వెల్లడించారు.



సీఎంకు 160 మంది మఠాధిపతుల సత్కారం

- విశ్వగురు బసవణ్ణను సాంస్కృతిక నాయకుడిగా ప్రకటించడంపై హర్షం

బెంగళూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): విశ్వగురు బసవణ్ణను కర్ణాటక సాంస్కృతిక నాయకుడిగా ప్రభుత్వం ప్రకటించడంపై స్వామీజీలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు అరుదైన సత్కారం చేశారు. విశ్వ బసవ ధర్మ ట్రస్టు, అనుభవ మం టపం- బసవకళ్యాణ, అఖిలభారత వీర శైవ లింగాయత మహాసభ, లింగాయత మఠాధిపతులు ఐక్యకూటమితో పా టు పలు సంస్థలు సంయుక్తంగా బసవకల్యాణలో సీఎంకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హుబ్బళ్లి మూరుసావిర మఠాధిపతి గురు సిద్ధరాజ యోగీశ్వర స్వామీజీ బసవజయ మృత్యుంజయ స్వామీజీ, డాక్టర్ మాత గంగాదేవి, సిద్ధరామేశ్వర స్వామీజీ, రాజేశ్వర శివాచార్య స్వామీజీతో పాటు 160మందికి పైగా శరణ స్వామీజీలు, గురువులు, వీరశైవ లింగాయత మఠాధిపతులు భాగస్వామ్యులయ్యా రు. అఖిల భారత వీరశైవ మహాసభ అధ్యక్షులు, ఎమ్మెల్యే శ్యామనూరు శివశంకరప్ప కార్యక్రమం ప్రారంభించగా బీదర్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఈశ్వర్‌ఖండ్రే అధ్యక్షత వహించారు. 12వ శతాబ్దంలోనే సమసమాజ నిర్మాణం కోసం పాటుపడిన బసవణ్ణను ప్రభుత్వం ఇటీవల కర్ణాటక సాం స్కృతిక నాయకుడిగా ప్రకటించిందన్నారు. స్వామీజీలు ముఖ్యమంత్రి నిర్ణయంపై ప్రత్యేకంగా కొనియాడారు.



సీఎం సిద్ధరామయ్యను సత్కరిస్తున్న మఠాధిపతులు, ప్రముఖులు

సిద్ధేశ్వరుడి రథం.. ముస్లింలే సారథ్యం

- హిందూ మఠానికి రథం సమకూర్చిన ముస్లిం ట్రస్టు
- గదగ్ జిల్లాలోని నరగుందలో విరబూసిన మత సామరస్యం


బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): హిందూ ముస్లింల మధ్య చిచ్చురేపేందుకు కొన్ని శక్తులు నిరంతరం ప్రయత్నిస్తున్నప్పటికీ సామరస్యం విరబూయించే అనేక ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా గదగ్ జిల్లా నరగుందలోని చారిత్రాత్మక పంచగ్రహ గుడ్డ హిరేమఠానికి చెందిన సిద్ధేశ్వర జాతర కోసం పట్టణంలోని ఇమామ్ సాహెబ మహ్మద్‌సాబ శరణర సేవా ట్రస్టు రూ.30 లక్షల ఖర్చుతో రథాన్ని నిర్మించి అందజేసింది. తద్వారా హిందూ ముస్లిం సామరస్యానికి బలమైన పునాదులు వేసింది. నాలుగేళ్ళ క్రిందట నరగుంద పట్టణానికి చెందిన మెహబూబ్ సుభాని దర్గా కు చెందిన బాబు అజ్జన పంచపీఠాధీశ్వరులలో ఒకరైన ఉజ్జయిని జగద్గురు సమక్షంలో హిరేమఠానికి నూతన రథాన్ని నిర్మించి ఇస్తామని వాగ్దానం చేశారు. కొవిడ్ కారణంగా ఇది ఇప్పుడు సాకారమయ్యిం దని దర్గా ట్రస్టు సభ్యులు వెల్లడించారు. 2023లో ఉజ్జయిని జగద్గురు అడ్డపల్లకి ఉత్సవంలో నూతన రథం ప్రస్తావన మళ్ళీరాగా ఏడాదిలోగా దీన్ని ట్రస్టు తరుపున సిద్ధం చేసి ఇస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ఇడగుంజి గణపతి దేవస్థానం ప్రధాన రథశిల్పి ద్వారా 25 అడుగుల ఎత్తయిన రథాన్ని నిర్మించారు. ముస్లిం శరణులు రథం నిర్మాణ బాధ్యత వహించినా దీనిని పూర్తిగా వీరశైవ లింగాయత ధర్మానికి అనుగుణంగా తయారు చేశారు. గురువారం నరగుందలో ఈ రథయాత్ర మెహబూబ్ సుభాని దర్గా ప్రాంగణం నుంచి ప్రారంభమై పంచగ్రహ గుడ్డలోని హిరేమఠం వరకు కనుల పండువగా సాగింది. పెద్ద సంఖ్యలో హిందూ ముస్లిం సోదరులు యాత్రలో పాలుపంచుకున్నారు. ఈ నూతన రథానికి ఐదురోజుల పాటు పలు ధార్మిక విధివిధానాలను సమర్పించనున్నారు. ఈ నెల 11న ఉజ్జయిని జగద్గురు సమక్షణంలో రథోత్సవం జరుగనుంది.



సిద్ధేశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న స్వామీజీలు, మఠగురువులు



రూ.30 లక్షలతో ముస్లింలు అందజేసిన నూతన రథం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1585.73	1,602.24
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,173	8,037
సామర్థ్యం (టీఎంసీలు)	7.81	24.56

16న జాతీయ లోక్ అదాలత్

బళ్లారి గాంధీనగర్, మార్చి 7: జాతీయ చట్టసేవల ప్రాధికార ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కోర్టు సెషన్స్ కోర్టు న్యాయాధికారి ఎస్.హెచ్. పుష్పాంజలి దేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీన జరగాల్సిన లోక్ అదాలత్‌ను మార్చి 16వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. తమ కేసులకు సంబంధించి రాజీకావాలనుకునే వారు చెక్‌బౌన్స్ కేసులు, బ్యాంకు కేసులు, మోటారు వాహన ప్రమాదాలు, వైవాహిక, కుటుంబ పరమైన కేసులు, సివిల్ కేసులు ఈ మెగా లోక్ అదాలత్ ద్వారా త్వరలో పరిష్కరించుకోవచ్చని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఒక ప్రకటనలో కోరారు.

ఎంటెక్‌లో చైత్రకు గోల్డ్ మెడల్



విద్యార్థిని కె.చైత్ర (ఫైల్)

బళ్లారి గాంధీనగర్, మార్చి 7: స్థానిక రావ్‌బహదూర్ వై. మహాబళేశ్వరప్ప ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న చైత్రకె ఎంటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హనుమంత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ విశ్వవిద్యాలయం స్థాయిలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆర్‌వైఎంసి కళాశాల విద్యార్థిని 9.53 సిజిపిఏ సాధించడంతో ఆమె గోల్డ్ మెడల్ లభించిందన్నారు. ఆ విద్యార్థినికి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రముఖులు కోరి నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సవిత, డీన్ పరీక్షల విభాగం డాక్టర్ బి.శ్రీపతి, ఐక్యూఏసి కో ఆర్డినేటర్ డాక్టర్ వీరభద్రప్ప, ఆర్‌వైఎంసి కళాశాల పాలనా మండలి పదాధికారులు అభినందనలు తెలిపారు.

దుగ్గలమ్మను దర్శించుకున్న మాజీ మంత్రి



దుగ్గలమ్మను దర్శించుకునేందుకు వస్తున్న మాజీ మంత్రి

కంప్లి, మార్చి7 : కురుగోడు తాలూకా పరిధిలోని వద్దట్టి గ్రామంలో గ్రామదేవత అయిన దుగ్గలమ్మను మాజీ మంత్రులు శ్రీరాములు దర్శించుకున్నారు. తోటి కార్యకర్తలతో కలిసి ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ప్రతి ఒక్కరు గ్రామాల్లో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరపడం వలన సకాలంలో వర్షాలు వస్తాయని తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తాము కూడా బరిలో దిగుతున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు కార్యకర్తలు, అభిమానులు కూడా వున్నారు.

బెంగళూరు బాంబు పేలుళ్ల నిందితుల కోసం బళ్లారిలో ఎన్‌ఐఏ సోదాలు



బళ్లారి బస్టాండులో పోలీసుల తనిఖీలు

బళ్లారి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో జరిగిన బాంబు పేలుళ్ల ఘటనపై నిందితుల కోసం ఎన్‌ఐఏ బృందం బళ్లారిలో సోదాలు చేస్తుంది. బళ్లారిలోని ప్రధాన కేఎస్ఆర్‌టీసీ బస్టాండులో నిందితుల కదలికలపై కెమెరాల ద్వారా గుర్తిస్తున్నారని ఎన్‌ఐఏ అధికారులు తెలిపారు. అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం బాంబు పేలుళ్ల నిందితులు బెంగళూరు నుంచి తుమకూర్‌కు, తుమకూర్ నుంచి బళ్లారికి రోడ్డు మార్గం ద్వారా వచ్చినట్లు ఎన్‌ఐఏ అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. బళ్లారిలోని కేఎస్ఆర్‌టీసీ బస్టాండులో కాసేపు ఉండి అనంతరం వేరే బస్సు మారినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించినట్లు ఎన్‌ఐఏ అధికారులు తెలిపారు. ఎన్‌ఐఏ అధికారులు సుమారు 10మంది కల బృందం బళ్లారిలో బాంబు పేలుళ్ల నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఇందులో నిందితుల ఆచూకి తెలిపిన వారికి రూ. 10లక్షలు బహుమతి ప్రకటించింది.

మహాశివరాత్రికి శివాలయాల ముస్తాబు

బళ్లారిరూరల్, మార్చి 7 : మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని శివాలయాలన్నీ అందంగా ముస్తాబయ్యాయి. బళ్లారి తాలుకా హగరి ఆర్‌ఎస్‌లో వేదవతి నది ఒడ్డున వెలసిన సోమేశ్వరాలయాన్ని మహాశివరాత్రి సందర్భంగా అందంగా ముస్తాబు చేశారు. ఈ దేవాలయం ప్రారంభమై 47 సంవత్సరాలు పూర్తి కావడంతో మహాశివరాత్రి సందర్భంగా స్వామి వారికి బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పాల్తూరు గాదెలింగప్ప తెలిపారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచారి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హగరి ఆర్ఎస్‌లో వెలసిన సోమేశ్వరాలయ గోపురంతో పాటు గర్భగుడిని అందంగా ముస్తాబు చేశారు. అదేవిధంగా మోకా మల్లేశ్వరాలయంతో పాటు, రూరల్ పరిధిలోని పలు దేవాలయాలను విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు.



హగరి ఆర్ఎస్‌లో శివరాత్రికి ముస్తాబైన సోమేశ్వరాలయం

జిల్లా సరిహద్దుల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు

బళ్లారి సిటీ, మార్చి 07: రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి అంతరాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అధికారులకు సూచించారు. నగర కలెక్టర్ కార్యాలయంలోని కేస్వాన్ వీడియో హాల్లో బుధవారం సాయంకాలం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కర్నూల్, రాయచూరు జిల్లాల జిల్లాకలెక్టర్లు, జిల్లా పోలీసు సూపరింటెండెంట్లతో జరిగిన వర్చువల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 72గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, అనంతపురం జిల్లాలతో సరిహద్దును పంచుకుంటున్నాయని, ఆ గ్రామాల రహదారుల గుండా అక్రమ రాకపోకలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో సకాలంలో సమాచారం ఇచ్చి నియంత్రించేందుకు సహకరించాలన్నారు. జిల్లా సరిహద్దుల్లో 23 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అక్రమంగా డబ్బు , మద్యం, బట్టలు, విలువైన వస్తువులను తరలించకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. నిఘా బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, సకాలంలో సమాచారం అందిస్తే వాటిని నివారించే అవకాశం ఉంటుందన్నారు. అంతరాష్ట్ర జిల్లాకలెక్టర్లు, జిల్లాపోలీసు సూపరింటెండెంట్లు సరిహద్దు పోలీసు స్టేషన్‌ల అధికారులు ఒక వాట్సాప్ గ్రూప్‌ను సృష్టించుకోవాలని, పరిణామాలపై అప్‌డేట్ చేయాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

జిల్లాపోలీసు సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్ బండారు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాతోపాటు ఇతర జిల్లాల రౌడీషీటర్లు, అనుమానాస్పద అల్లర్లు, సరిహద్దు గ్రామాల్లో కార్యకలాపాలపై పరస్పర సమాచార మార్పిడి జరగాలన్నారు. ఈసందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా, అసిస్టెంట్ కమిషనర్ హేమంత్‌కుమార్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, అనంతపురం, కర్నూల్, రాయచూరు జిల్లాల కలెక్టర్లు, జిల్లా పోలీసుసూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న చిన్నారులు

కంప్లి, మార్చి 7: మాట్లాడే మనిషికి దాహం వేస్తే ఎంతదూరమైనా వెళ్లి దాహం తీర్చుకుంటాడు. కానీ మూగజీవులు ఆరుబయట నీరు లేక రోజురోజుకు ఇబ్బందులు పడుతున్నాయి. ఇప్పుడున్న వేసవిలో పక్షులకు నీటి సమస్య ఏర్పడింది. దానిని దృష్టిలో వుంచుకుని సీపిరిదిన్నెలోని పాఠశాల విద్యార్థులు ప్రతినిత్యం పాఠశాలకు వచ్చే సమయంలో తమ ఇళ్ల నుంచి నీటి బాటిళ్లను తీసుకువచ్చి పాఠశాలలో వుండే చెట్లకు వేలాడదీసి పక్షుల దాహార్తిని తీర్చుతున్నారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తోటి ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను అభినందించారు. ప్రతి ఒక్కరు తమ ఇళ్ల ముందు గానీ మిద్దెలపైన గానీ నీటి కుండలను ఏర్పాటు చేసి పక్షుల దాహార్తిని తీర్చాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.





పక్షుల కోసం చెట్ల కొమ్మలకు నీటి బాటిళ్లను కడుతున్న విద్యార్థినీ విద్యార్థులు

వేళాపాళా పాటించని ఫ్యాక్టరీ లారీలు



కంప్లి, మార్చి 7 : కురుగోడు పట్టణంలో సహ జిందాల్, ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీలకు వెళ్లే లారీలు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తిరగరాదని తీర్మానం చేశారు. కానీ అధికారులు ఇచ్చిన సమయాన్ని పట్టించుకోకుండా పెద్ద పెద్ద లారీలు సమయాన్ని లెక్క చేయకుండా పట్టణం మధ్యలోనే తిరుగుతుండటంతో పట్టణ ప్రజలకు, విద్యార్థులకు ఎంతో ఇబ్బంది కలుగుతోందని పట్టణ పంచాయతీ కౌన్సిలర్ హాలప్ప తెలిపారు. పట్టణం మధ్యలో రోడ్డు పనులు జరుగుతున్నాయని, ఇలా ఫ్యాక్టరీల లారీలు రోడ్డు మధ్యలోనుంచి వెళుతుండటంతో పనులకు కూడా అంతరాయం కలుగుతోంది. అధికారుల ఆదేశాలను లెక్క చేయకుండా వాహనాలను తిప్పుతున్నారు. వెంటనే వారికిచ్చిన సమయంలో వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖకు కూడా తాము పట్టణ పంచాయతీ నుంచి మనవి పత్రం కూడా అందించామన్నారు. రానున్న పదవ తరగతి విద్యార్థుల పరీక్షలను దృష్టిలో వుంచుకుని జిల్లా అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే

బళ్లారిరూరల్, మార్చి 7 : బళ్లారి నగరంలో 3, 5, 34, 35 వార్డులలో వివిధ అభివృద్ధి పనులకు గురువారం సిటీ ఎమ్మెల్యే భరత్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఏవైనా సమస్యలు వుంటే తన దృష్టికి తీసుకురావాలని, సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ శ్వేత, ఉపమేయర్ జానకమ్మ, కార్పొరేటర్లు నూర్ అహ్మద్, ప్రభంజన్ కుమార్, మించు శ్రీనివాస్, ఎం రాజేశ్వరి, రాజశేఖర్, కాంగ్రెస్ ప్రముఖులు సుబ్బరాయుడు, బీఆర్ఎల్ శీన, కళ్యాణ్, వీరేంద్ర, వెంకటేష్, వాసిమ్ పాల్గొన్నారు.



35వ వార్డులో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

గర్భిణుల ఆరోగ్య పరిరక్షణ ముఖ్యం

● డీహెచ్ఓ డాక్టర్ వై.రమేష్ బాబు



బళ్లారి గాంధీనగర్, మార్చి 7: గర్భిణీ స్త్రీల ఆరోగ్య విషయంలో కుటుంబ సభ్యులు నిర్లక్ష్యం చేయరాదని, తద్వారా గర్భవతుల మరణాలను అరికట్టవచ్చని జిల్లా కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వై.రమేష్ బాబు పేర్కొన్నారు. చిన్నవయస్సులోనే వివాహాలు జరగడం ద్వారా గర్భిణీ స్త్రీలు ఒక్కోసారి ప్రాణాలు కోల్పోవాల్సి ఉంటుందన్నారు. కావున 18 సంవత్సరాలు నిండిన తరువాతనే ఆడపిల్లకు వివాహం చేయాలని సూచించారు. గర్భిణీ అని తెలిసిన వెంటనే వారి వివరాలను స్థానిక సార్వజనిక ఆసుపత్రిలో నమోదు చేసి తాయి కార్డు పొందాలన్నారు.

నాగమ్మవ్వ మఠంలో ఒక్కటైన 14 జంటలు

బళ్లారిరూరల్, మార్చి 7 : బళ్లారి రూరల్ పరిధిలోని సబ్రహళ్లి గ్రామంలో శ్రీ శివశరణు నాగమ్మవ్వ మఠంలో నాగమ్మవ్వ కుమారులు నాగరాజు స్వామి, శివకుమారస్వామి, గంగాధర స్వామి నేతృత్వంలో గురువారం 22 జంటలు ఒక్కటయ్యారు. ఈ సామూహిక వివాహాల్లో కేఆర్‌పీపీ ప్రముఖురాలు గాలి జనార్దన్ రెడ్డి సతీమణి లక్ష్మీఅరుణ, కేఆర్‌పీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఎస్ దివాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జునాచారి, మహిళా జిల్లా అధ్యక్షులు హంపి రమణమ్మ, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత



పర్యావరణాన్ని రక్షించాలని వీధుల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల నినాదాలు

బళ్లారి సిటీ, మార్చి 07: పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత అని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. తాలూకాలోని శ్రీ క్షేత్ర చెళ్లగుర్కిలో గురువారం కృషి మహావిద్యాలయ హగరి విద్యార్థులు నిర్వహించిన పర్యావరణ అవగాహన కవాతు శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో పాల్గొనడం ముఖ్యం కాదని, ఆ విషయంలో మన ప్రవర్తన బాగుండాలన్నారు. దేశం మనకు ఏమి ఇచ్చిందనే బదులు, దేశం కోసం నేనేమి ఇచ్చాను అనే ప్రశ్న రావాలన్నారు. ఈసందర్భంగా శిబిరం ప్రాజెక్టు అధికారి నాగేశ్, బసప్ప, గ్రూపు నాయకులు సరస్వతి,అనిల్ కమార్, రామచంద్ర, శరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి



తాయణ్ణను సన్మానిస్తున్న జేడీఎస్ పార్టీ నాయకులు

సిరుగుప్ప, మార్చి 7 : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని జేడీఎస్ పార్టీ నాయకులు మీనళ్లి తాయణ్ణ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిరుగుప్ప పట్టణంలో గురువారం రెండవ సారి జేడీఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మీనళ్లి తాయణ్ణకు అభినందన కార్యక్రమం చేపట్టారు. జేడీఎస్ నగర అధ్యక్షుడు బాషా ముల్లార్, తాలుకా అధ్యక్షుడు శివ నారాయణ ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మీనళ్లి తాయణ్ణ మాట్లాడుతూ, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలో బీజేపీ, జేడీఎస్ పొత్తు వుంటుందని తెలిపారు. అభ్యర్థులు ఏ పార్టీ వారైనా బళ్లారి కొప్పల్ లోక్‌సభ నియోజక వర్గాల్లో అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నిర్మాణాత్మక జీవితానికి రాజ్యాంగం ముఖ్యం



మాట్లాడుతున్న హొన్నూర్ వలి

బళ్లారి సిటీ, మార్చి 07: నిర్మాణాత్మక జీవితానికి రాజ్యాంగం అవసరమని సరళాదేవి కళాశాల రాజకీయ శాస్త్ర విభాగాధిపతి హొన్నూర్ వలి అభిప్రాయపడ్డారు. జిల్లాపరిపాలన, జిల్లాపంచాయితీ, సాంఘిక సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నగరంలోని సరళాదేవి ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన రాజ్యాంగ అవగాహన జాతా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం ఏర్పడి ఏడు దశాబ్దాలు గడిచినా అది భారతీయుల చైతన్యంలో భాగం కాకపోవడం చాలా ఆందోళన కలిగించే అంశం అన్నారు. రాజ్యాంగంలోని ఆశయాలు, లక్ష్యాలు ప్రతి పౌరుడి చైతన్యంలో భాగం కాకపోతే మన ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రభుత్వాలు మనల్ని పరిపాలిస్తాయని అన్నారు. కన్నడ విభాగాధిపతి దస్తగిరి సాబ్ మాట్లాడుతూ రాజ్యాంగం మనకు వాక్ స్వాంత్ర్యం , భావప్రకటనా స్వేచ్ఛ, ఓటింగ్ తదితర హక్కులను కల్పించిందని, వాటిని లౌకిక స్ఫూర్తితో మనమంతా అలవర్చుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు దురుగప్ప మాట్లాడుతూ ఎంతో కీలకమైన పదవులు కలిగిన రాజ్యాంగాన్ని గౌరవించి సాకారం చేసే పని నేడు జరగాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ మంజునాథ్ రెడ్డి రాజ్యాంగ ప్రవేశిక అద్దం లాంటిదని, రాజ్యాంగాన్ని అర్థం చేసుకుని సరైన మార్గంలో జీవించినప్పుడే సుసంపన్నమైన భారతావనిని చూడడం సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల సహాయ ఆచార్యులు డాక్టర్ శశికాంత బిల్లవ, అరుణ్‌కుమార్, కే.బసప్ప, ప్రవీణ్‌కుమార్, లింగప్ప, రామస్వామి, హేమేగౌడ, సుజాత, రవీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హొసూరు జోన్

రూ.1.60 కోట్లతో ప్రాజెక్టు పనుల ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై.ప్రకాశ్, ప్రముఖులు

హొసూరు, మార్చి7: హొసూరు యూనియన్ పరిధిలోని నల్లూరు పంచాయతీకి సుమారు రూ.కోటి 60లక్షలతో చేపట్టిన ప్రాజెక్టు పనులను ఎమ్మెల్యే వై.ప్రకాశ్ ప్రారంభించారు. హొసూరు మండల పరిధిలోని నల్లూరు పంచాయతీ పరిధిల్లో గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు చేసి కొత్త రోడ్లను నిర్మించాలని పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షుడు శాంత వీరభద్రప్ప ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించారు. ఈ పరిస్థితిలో ప్రస్తుతం ఎన్ఆర్‌జీఎస్ ద్వారా పెరియ ఎలసగిరి వరకు రూ.9.35 లక్షల కాంక్రీట్ రోడ్డు, రూ.9.17 లక్షలతో పేవర్ బ్లాకులతో రోడ్డు నిర్మాణం చితకనపల్లిలో రూ.8.98 లక్షలతో మురుగు కాల్వ నిర్మాణం , నల్లూరు ప్రాంతంల్లో రూ.48 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. రాజాజీ నగర్ ప్రాంతంల్లో రూ. కోటి 61 లక్షల అంచనా వ్యయంతో మురుగు నీటి కాలువను నిర్మించేందుకు రూ.7.34 లక్షలు కేటాయించారు. ఈ కార్యక్రమంల్లో ఎమ్మెల్యే వైప్రకాశ్, యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి, నల్లూరు మున్సిపల్ చైర్మెన్ శాంతవీరభద్రప్ప, యూనియన్ పంచాయతీ కమిటీ సభ్యుడు గోపాల్, నిర్వాహకులు శ్రీనివాస్, సుబ్రహ్మణి, మంజునాథ్, రాజేశ్, చంద్రశేఖర్, వార్డు సభ్యులు అధిక సంఖ్యల్లో పాల్గొన్నారు.

కర్మాగారాల్లో ప్లాస్టిక్ కవర్ల తనిఖీ

హొసూరు(మత్తిగిరి) మార్చి 7 : తమిళనాడులో నిషేదిత ప్లాస్టిక్ కవర్లు తయారీ కర్మాగారం హొసూరు జూజువాడి అంతమేపల్లి ప్రాంతంలో గత కొన్ని నెలలుగా నడుస్తోంది. ఈ కర్మాగారాన్ని తేజారామ్ నడుపుతున్నారు. ఇక్కడ తయారైన ప్లాస్టిక్ కవర్లను కర్ణాటక రాష్ట్రానికి పంపిస్తారు. ఈ విషయంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలికి రహస్య సమాచారం అందింది. అనంతరం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు , జిల్లా ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ సెల్వకుమార్, కార్పొరేషన్ హొసూరు మున్సిపల్ సంక్షేమాధికారి ప్రభాకర్ సంఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. కర్మాగారంలో నిషేదిత ప్లాస్టిక్ కవర్లు సిద్ధం చేసి ప్యాకింగ్ చేస్తున్నారు. దీంతో అక్కడి నుంచి దాదాపు 6.5 టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

జీవనోపాధికి సాయం అందించిన ప్రభుత్వం

హొసూరు(మత్తిగిరి) మార్చి 7 : హొసూరు కార్పొరేషన్ కార్యాలయంల్లో రోడ్డు పక్కన వ్యాపారులకు జాతీయ పట్టణ జీవనోపాధి పథకం క్రింద వాహనాలను అందించడానికి 4 వ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలిపింది. అందుకు అనుగుణంగా హొసూరు కార్పొరేషన్ కార్యాలయంల్లో రూ.31 .40 లక్షల విలువైన 40 బండ్లు , కూరగాయలు విక్రయించేందుకు 22 బండ్లు, ఆహారం విక్రయించేందుకు 8 బండ్లు, పూలు విక్రయించేందుకు 10 బండ్లను హొసూరు మేయర్ సత్య వ్యాపారులకు అందజేశారు.



వివిధ వ్యాపారులకు బండ్లను అందిస్తున్న డీఎంకే ప్రముఖులు

మహిళల ఆరోగ్యమే సమాజ ఆరోగ్యం

● మహిళా దినోత్సవంలో జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం

రాయచూరు, మార్చి 7 : మహిళలు ఆరోగ్య వంతులుగా ఉన్నప్పుడే సమాజం మరింత ఆరోగ్యవంతంగా తయారవుతుందని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వె అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పంచాయతీ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో గురువారం నగరంలోని మహాత్మగాంది స్టేడియంలో మహిళ క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను మొక్కలు నాటి ప్రారంభించిన జడ్పీ సీఈఓ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్న విషయం గర్వించదగ్గదన్నారు. అదే విధంగా క్రీడల్లోను మహిళలు సరైన సాధనతో అద్భుత విజయాలు సాధించాలని సూచించారు. అదే సమయంలో త్వరలోనే రానున్న లోకసభ ఎన్నికల్లో మహిళలు పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనేలా తమవంతు పాత్ర పోషించాలన్నారు

అగ్ని ప్రమాదంలో సిమెంట్ లారీ దగ్ధం

రాయచూరు, మార్చి 7 : సిమెంట్ లోడ్‌తో వెలుతున్న లారీకి షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించగా లారీతో పాటు సిమెంట్ పూర్తిగా దగ్ధమైంది. గురువారం తెల్లవారు జామున జరిగిన ఈ సంఘటన నగర సమీపంలోని బైపాస్ రోడ్డులో చోటు చేసుకుంది. గోవా నుంచి సిమెంట్ లోడ్‌తో కలకత్తాకు వెళుతున్న ఈ లారీ తెలంగాణ రాష్ట్రం నరగుండా జిల్లాకు చెందిన టీఎస్-05 యూడీ 3477గా గుర్తించారు. ప్రమాదం వార్త తెలుసుకున్న అగ్ని మాపక సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలార్పే ప్రయత్నం చేసేలోగా లారీ అగ్నికి ఆహుతైంది. సగం వరకు సిమెంట్ కూడా పూర్తిగా కాలిపోవడంతో దాదాపు రూ.32 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కేంద్రంపై సీఎం విమర్శలు అర్థ రహితం : ఎమ్మెల్సీ


రాయచూరు, మార్చి 7 : రాష్ట్రం నుంచి వెళ్లే పన్నుల ఆదాయం నుంచి కేంద్రం రాష్ట్రానికి ఇస్తున్న నిధులు అతి తక్కువ అంటూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన విమర్శలు అర్థరహితమేగాక పచ్చ అబద్ధమని ఎమ్మెల్సీ రవికుమార్ అన్నారు. 2004-2014 మధ్య ఉన్న యూపీఏ ప్రభుత్వంతో పోలిస్తే 2014-2024 మధ్య బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన ఆర్థిక తోడ్పాటు 246 శాతం ఎక్కువగా ఉన్న వాస్తవాన్ని ముఖ్యమంత్రి గుర్తించాలన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎ.పాపారెడ్డిలతో కలిసి ఎమ్మెల్సీ రవికుమార్ విలేఖరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తన అసమర్థతను కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో కేంద్రం పై విమర్శలు చేయడాన్ని అలవాటుగా మార్చుకుందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవికుమార్

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...



మహాశివరాత్రి

ఏటా మాఘమాసం కృష్ణ పక్షంలో వ చ్చే చతుర్దశిని మహాశివరాత్రి పర్వదినంగా ఆచరిస్తారు. పురాణాల ప్రకారం మహాశివుడు లింగాకారంలో ఆవిర్భవించిన మహాపర్వదినంగా కొలుస్తారు. ఈరోజంతా భక్తులు ఉపవాసం, జాగరణ చేయడం ద్వారా స్వామి కృపా కటాక్షాలు పొందుతారు. ఆలయాలలో యామ పూజలు, రుద్రాభిషేకం ఇతరత్రా విశేషపూజలు నిర్వహిస్తారు. ఓం నమఃశివాయ పంచాక్షరీ మంత్రాన్ని స్మరిస్తూ భక్తులు గడుపుతారు.

దామెర్ల రామారావు (జయంతి)



దేశం గర్వించదగ్గ చిత్రకారులలో ఒకరైన దామెర్ల రామారావు 1897 మార్చి 8న తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. రామారావు ప్రతిభను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆస్వాల్డ్ కూల్డ్రే గుర్తించి సొంతఖర్చుతో బొంబాయిలోని జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌కు పంపారు. 'మేయో' బంగారు పతకాన్ని పొందారు. ఆయన గీసిన పుష్పాలంకరణ, గొల్లపడుచు, గోదావరి లోయ వంటి చిత్రాలు ఎంతో పేరొందాయి. బ్రిటీష్ ఎంపైర్ ప్రదర్శనశాలలో ఆయన చిత్రాలు ఏడాదిపాటు ప్రదర్శనకు ఉంచడం చిత్రకళా ప్రతిభకు తార్కాణం. 1923లో ఆర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేసి ఎంతో మంది యువతకు శిక్షణ ఇచ్చారు. 28వ యేట 1925 ఫిబ్రవరి 6న అకాలమరణం చెందడం చిత్రకళారంగానికి తీరని లోటు. ఆయన జ్ఞాపకార్థం ఒక చిత్రకళా మందిరం ఏర్పాటు చేశారు.

సాహిర్ లుధియాన్వి (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత సాహిర్ లుధియాన్వి 1921 మార్చి 8న పంజాబ్ రాష్ట్రం లూథియానాలో జన్మించారు. హిందీ, ఉర్దూ భాషలలో కవిగా, సినీ గేయరచయితగా పేరొందారు. గజల్స్‌లో రాణించారు. సమాజంలోని పలు అంశాలు, యుద్ధంపై రచనలు చేశారు. 1940-70 మధ్య అప్పటి యువత ఆలోచనలకు అనుగుణంగా రచనలు సాగించారు. పలు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు పొందారు. 1980 అక్టోబరు 25న గుండెపోటుతో కన్నుమూశారు.

వసుంధరరాజే సింధియా (పుట్టినరోజు)



ధోల్‌పూర్ రాజవంశస్తురాలైన వసుంధరరాజే సింధియా 1953 మార్చి 8న ముంబైలో జన్మించారు. ఆమె రాజస్థాన్‌కు 2003 నుంచి 2008 వరకు, 2013 నుంచి 2018 వరకు రెండుసార్లు ముఖ్యమంత్రిగా కొనసాగారు. కేంద్రమంత్రిగాను వ్యవహరించారు. బీజేపీ యువమోర్చాకు ఉపాధ్యక్షురాలిగా వ్యవహరించారు. మహిళా సాధికారత కోసం ఆమె చేసిన సేవలను గుర్తిస్తూ 2007లో ఐక్యరాజ్యసమితిచే 'ఉమెన్ టు గెదర్ అవార్డ్' పొందారు. 2018లో స్కాచ్ సమ్మిట్‌లో 'ఉత్తమ ముఖ్యమంత్రి'గా గౌరవం అందుకున్నారు. ప్రస్తుతం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు.

సామర్థ్యంతో సత్తాచాటుకోవాలి

● మహిళలకు ప్రభుత్వ మాజీ ముఖ్య కార్యదర్శి రత్న ప్రభ పిలుపు

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎవరో వస్తారని ఎదో ఉద్ధరిస్తారని ఎదురు చూడకుండా తమ సామర్థ్యాన్ని గరిష్టంగా వినియోగించుకుని సత్తాచాటుకోవాలని మహిళా మణులకు ప్రభుత్వ మాజీ ముఖ్య కార్యదర్శి రత్న ప్రభ పిలుపునిచ్చారు. కర్నాటక మీడియా జర్నలిస్టు యూనియన్ 5వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని బెంగళూరు ప్రెస్ క్లబ్ ఆవరణలో గురువారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రసగించిన ఆమె 7 నెలల పాటు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిగా సేవలందించే అవకాశం తనకు దక్కిందని ఈ అవధిలో మ హిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, సామాన్యుల సమస్యలను పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చి వారి హృదయాలను గెలిచానన్నారు. బీదర్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన నాటి కొన్ని అనుభూతులను సభికులతో పంచుకున్నారు. మహిళాపాత్రికేయులను గుర్తించి సన్మానించడం ఎంతోసంతోషంగా ఉందన్నారు. ఐపీఎస్ అధికారి రూప మౌద్గిల్ మాట్లాడుతూ ఒక తల్లిగా సౌమ్య స్వభావాన్ని, ఒక అధికారిగా కఠిన స్వభావాన్ని ప్రదర్శించాల్సిన సమయం మహిళా ఉద్యోగులకు పెనుసవాల్ లాంటిదన్నారు. ఈ రెండింటిని బ్యాలెన్స్ చేయడం ఎంతో కషతరమన్నారు. అత్యాచారాలను నియంత్రించడం కేవలం చట్టాలతోనే సాధ్యం కాదని ప్రజల్లో కూడా మార్పు రావాలని ఆమె అభిప్రాయపడ్డారు. సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ రూప, తదితరులు ప్రసంగించారు. ఇదేసందర్భంగా మహిళా పాత్రికేయులు విద్యాశ్రీ, మమత, శిల్పాశ్రీ, పుణ్యవర్తి, అశ్విని దేవాడిగ, ప్రతిభారామన్, విద్యా, నీతి వేణుగౌడ, అశ్విని, విద్యారశ్మి, జేఎస్.అనురాధాలకు మాధ్యమ సేవారత్న పురస్కారాలను ప్రదానం చేసి గౌరవించారు. ఇదే వేదికపై పలువురు మహిళా సాధకులకు సేవా రత్న పురస్కారాలను అందజేసి సన్మానించారు. వీరిలో పల్లవి ఆకృతి, హాలిమంగళ గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు పిళ్ళమ్మ, ప్రముఖ పారిశ్రామిక వేత్త వి.ప్రభావతి సురేంద్రన్‌లు ఉన్నారు. కార్యక్రమంలో బెంగళూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్, యూనియన్ అధ్యక్షుడు జి.చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షులు శివకుమార్ బెళ్ళి తట్టి, ప్రధాన కార్యదర్శి ఎన్‌కె.స్వామి, కోశాధికారి సురేష్‌కుమార్, కార్యదర్శి బిఎ.మహేంద్ర తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో పాత్రికేయులు, ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న మహిళా పాత్రికేయులు

ఘనంగా మహిళా దినోత్సవం

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అమెజాన్ ఇండియా ఆధ్వర్యంలో 49వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. మహిళా ఉద్యోగుల ప్రాతినిధ్యాన్ని మరింతగా పెంచాలన్న సంకల్పంతో ఈ ఉత్సవాలను నిర్వహించారు. ఇన్‌స్పైర్ ఇన్ క్లూషన్ అనే ధ్యేయవాక్యంతో ప్రస్తుత ఏడాది మహిళా ఉద్యోగుల సాధికారత కోసం 49 ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేయాలని నిర్ణయించినట్లు సంస్థ ఉపాధ్యక్షురాలు దీప్తి వర్మ వెల్లడించారు. రీకిండల్ మహిళా ఉద్యోగులకు మరిన్ని అవకాశాలను కల్పించనుందన్నారు. లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ అండ్ క్రైస్ట్ అలయనెన్స్ ద్వారా కంప్యూటర్ సైన్స్ బోధనను దేశవ్యాప్తంగా 10వేల పాఠశాలల్లో అందుబాటులోకి తెచ్చామన్నారు. షి ఈజ్ అమెజాన్ అనే అభియానను కూడా ప్రారంభించామని ఆమె ప్రకటించారు. మహిళా ఉద్యోగులకు నైపుణ్య శిక్షణనిచ్చేందుకు అమెజాన్ ఇండియా గ్లబల్ అలయెన్స్ ఫర్ మాస్ ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్‌తో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఈ ఒప్పందం దరిమిలా ద్వితీయ తృతీయ శ్రేణి నగరాల్లో 25వేల మహిళా పారిశ్రామిక వేత్తలను తీర్చిదిద్దనున్నట్లు ప్రకటించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతిభావంతులైన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.



సన్మానం అందుకున్న మహిళలు

మరోసారి దళిత సీఎం ప్రస్తావన

● యూటర్న్ తీసుకున్న మంత్రి మహదేవప్ప



బెంగళూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగే ప్రతిసారి దళిత సీఎం ప్రస్తావన తెరపైకి వస్తుంది. అయితే గంటలు లేదా రోజుల వ్యవధిలోనే సమసిపోవడం సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది. రాష్ట్ర కాంగ్రెస్‌లో దళిత సామాజిక వర్గానికి చెందినవారు ఎంతోమంది సీనియర్‌లు ఉన్నారు. దశాబ్దాల కాలంగా ముఖ్యమంత్రి కావాలనేది వారి ఆశయం ఆకాంక్ష కూడా కానీ అనూహ్యంగా ప్రస్తావన వచ్చిన వేగంగానే తిరుగుటపా కట్టినట్లుగా మరోసారి మారింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి, సీఎంకు అత్యంత సన్నిహితుడైన మహదేవప్ప ఓ సభలో మాట్లాడుతూ దళితులు కేవలం ఓట్లువేసేందుకు మాత్రమే పరిమితంగా మారిపోయారని వారినుంచి ఎవరెవరో నేతలుగా ఎదిగారని కానీ ముఖ్యమంత్రి అయ్యే అవకాశం లేదా అనే ప్రశ్నను లేవనెత్తారు. అందుకు కేబినెట్‌లో కీలక మంత్రులు రాజణ్ణ, సతీష్‌జార్కిహోళిలు మద్దతు ఇచ్చారు. కానీ వ్యవసాయ శాఖా మంత్రి చెలువరాయస్వామి మాత్రం ప్రస్తుతానికి సీఎం సీటు ఖాళీలేదన్నారు. ఇలా అనుకూలంగా, వ్యతిరేకంగా ఎన్నో ప్రశ్నలు, సమాధానాలు బహిరంగమయ్యాయి. మరో వైపు ఎప్పుడు సీఎం అవుతానా అని ఎదురు చూస్తున్న డీసీఎం డీకే శివకుమార్‌తో పాటు ఆయన వర్గీయులకు కాస్త ఇబ్బందికర వాతావరణం కలిగింది. అయితే దీని వెనుకా పెద్దరాజకీయమే ఉన్నట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డీసీఎం డీకే శివకుమార్‌పై ఈడీలో పెండింగ్‌లో ఉండే కేసులను సుప్రీం కోర్టు కొట్టివేయడంతో లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎప్పుడైనా ప్రస్తావన తీసుకురావచ్చునని ఇదే అవకాశంగా దళిత సీఎం ప్రస్తావన వచ్చినట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డిమాండ్ పట్ల కొందరు మంత్రులతో పాటు సీనియర్‌ల మద్దతు ఉన్నా తాజాగా గురువారం మంత్రి మహదేవప్ప యూటర్న్ తీసుకునేలా వ్యాఖ్యానించారు. అంబేద్కర్ చెప్పినట్లుగా కేవలం రిజర్వేషన్‌లతో సంతోషం కలుగదని నా ప్రజలు అధికారంలోను ఉండాలని ఆకాంక్షించారని పాలసీలు రూపొందించే హోదాలో ఉండాలని చెప్పారన్నారు. కానీ ఇప్పుడు దళిత సీఎం కావాలనే డిమాండ్ కాదని తప్పుగా ప్రచారం చేయరాదన్నారు. దీంతో మహదేవప్ప లేవనెత్తిన అంశం కేవలం ఒకరోజులోనే చల్లబడింది. 2013 ఎన్నికల వేళ అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు పరమేశ్వర్ తీవ్రంగా ప్రయత్నించారు. కానీ ఎన్నికలలో ఓడిపోవడంతో సాధ్యం కాలేదు. ఆతర్వాత పలు సందర్భాలు వచ్చినా అసంతృప్తి మిగిలింది. గతంలో మల్లికార్జునఖర్గేకు అటువంటి అవకాశమే చేజారిందనే విమర్శలు ఉన్నాయి.

నో ఎంట్రీ..!

●ధారవాడ ప్రవేశానికి ససేమిరా....

● కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణికి సుప్రీంలోనూ షాక్

బెంగళూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ జెడ్పీ సభ్యుడు యోగేష్‌గౌడ హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఉండే ధారవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్‌కులకర్ణికి సుప్రీం కోర్టులోనూ షాక్ తగిలింది. దాదాపు రెండేళ్ళ కాలంగా వినయ్‌కులకర్ణికి సొంతూరు ధారవాడలో ప్రవేశించేందుకు అనుమతులు లేవు. ఇప్పటికే జిల్లాతో పాటు హైకోర్టు ధర్మాసనంలోనూ చుక్కెదురయ్యింది. దీంతో ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో పర్యటించాల్సి ఉందని ధారవాడకు వెళ్ళేందుకు అనుమతులు ఇవ్వాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. న్యాయమూర్తి ఎం త్రివేది ధర్మాసనం విచారణ జరిపారు. ధారవాడ ప్రవేశానికి అనుమతులు ఇవ్వరాదని విచారణ జరుపుతున్న సీబీఐ తరుపు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ధర్మాసనం ధారవాడ ప్రవేశానికి అనుమతులు నిరాకరించారు. వివాదాన్ని స్థానిక కోర్టులోనే పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి సూచించారు. 2016 జూన్ 15న ధారవాడ బీజేపీ జిల్లాపంచాయతీ సభ్యుడు యోగేష్‌గౌడ హత్య జరిగింది. అప్పట్లో వినయ్‌కులకర్ణి మంత్రిగా వ్యవహరించేవారు. 2019లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక కేసును సీబీఐ విచారణ కోరారు. దర్యాప్తులో భాగంగా వినయ్‌కులకర్ణిని అరెస్టు చేయగా సుదీర్ఘకాలం తర్వాత బెయిలుపై విడుదలయ్యారు. అయితే సొంతూరు ధారవాడల ప్రవేశించకుండా ఆంక్షలు విధించారు. చివరకు 2023 శాసనసభ ఎన్నికలలో నామినేషన్, ప్రచారాలకు వెళ్ళలేక పోయారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి.

వివాహేతర సంబంధం ఉన్న మహిళకు భరణం అవసరం లేదు : హైకోర్టు

బెంగళూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలు విడాకులు తీసుకున్న తర్వాత భార్యకు భరణం చెల్లించాలని నిబంధన ఉంది. కానీ హైకోర్టు ధర్మాసనం గురువారం సంచలనమైన తీర్పును ప్రకటించింది. భర్తనుంచి దూరం అయ్యేందుకు విడాకుల దరఖాస్తు చేసుకున్న భార్య మరో పురుషుడితో సంబంధం కలిగి ఉంటే భరణం పొందడం సాధ్యం కాదని ధర్మాసనం ఆదేశించింది. చట్టబద్ధంగా పెళ్ళిచేసుకున్నానని జీవనం సాగించేందుకు భరణం అర్హత ఉందని భార్య వాదనలను ఒప్పుకునేది లేదని ధర్మాసనం తేల్చింది. పిటీషన్ దాఖలు చేసిన ఆమె వివాహేతర సంబంధం కొనసాగిస్తూ భరణం కోరే ప్రశ్న ఉండదన్నారు. పిటీషనర్ చట్టబద్ధంగా పెళ్ళి చేసుకున్నానని జీవనం సాగించేందుకు భరణం ఇప్పించాలనే వాదనలపై న్యాయమూర్తి రాజేంద్ర బాదామికర్ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. పిటీషనర్ నడవడికలు పరిగణించాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. భర్త నుంచి భరణం ఇప్పించాలంటూ కోర్టులో పిటీషన్ దాఖలు చేసినప్పుడు ఆమె ప్రామాణికతను రుజువు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆమె నైతికతను నిరూపించుకోకుండానే విడాకులు తీసుకున్న భర్తపై ఆరోపణలు చేయడం సాధ్యం కాదని కోర్టు అభిప్రాయపడింది.

10 నుంచి సీకే నాయుడు క్రికెట్ టోర్నీ ఫైనల్

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కర్నల్ సికె.నాయుడు క్రికెట్ టోర్నమెంటు ఫైనల్ బెంగళూరు చిన్నస్వామి క్రికెట్ స్టేడియంలో ఈ నెల 10 నుంచి 14 వరకు జరుగనుంది. ఈ మేరకు నగరంలో గురువారం ఒక ప్రకటన విడుదలైంది. ఫైనల్స్‌లో కర్నాటక. ఉత్తర ప్రదేశ్ జట్లు తలపడనున్నాయి.

గత నెలలో 20 కిలోల బంగారం స్వాధీనం

బెంగళూరు కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఫిబ్రవరి నెలలో మొత్తం నాలుగు ఘటనలకు సంబంధించి 20 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ అధికారులు గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. దీని విలువ రూ 12.44 కోట్లుగా ఉంటుందన్నారు. విమానాశ్రయంలో తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నందునే బంగారం స్మగ్లింగ్‌కు బ్రేక్‌పడుతోందని పేర్కొన్నారు.

బీఎంటీసీ ప్రత్యేక ప్యాకేజీ

మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని చిక్కబళ్ళాపురం చుట్టు పక్కలప్రాంతాలలోని పర్యాటక కేంద్రాలు తిలకించే వారి కోసం బీఎంటీసీ ఈ నెల 8నుంచి ప్రత్యేక ప్యాకేజీ సర్వీసులను ప్రారంభించనుంది. సెలవు రోజులు, వారాంతపు రోజుల్లో పర్యాటకుల సౌకర్యార్థం ఎసీ బస్సులు నడుపనున్నారు. తొలి ప్యాకేజీ బస్సు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు కెంపెగౌడ బస్టాండ్ నుంచి బయల్దేరి వెళ్ళనుంది. నందీశ్వర దేవస్థానం, కణివె బసవణ్ణ దేవస్థానం, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య మ్యూజియం, సమాధి, రంగస్థళ రంగనాథస్వామి దేవస్థానం, ఈశా ఫౌండేషన్‌ల సందర్శన అనంతరం ఈ బస్సు రాత్రి 9-30కు బెంగళూరునగరానికి చే రుకుంటుంది. ఈ ప్యాకేజీ ధర ఒక్కొక్కరికి రూ.500గా ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఎంటిసి నగరంలో గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

తెలంగాణ ఆర్టీసీలో 10శాతం రాయితీ

బెంగళూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రోడ్డు రవాణా సంస్థకు అనుబంధమైన లహరి బస్సు ఛార్జీలలో 10శాతం రాయితీ అమలు చేస్తున్నట్లు తెలంగాణ ఆర్టీసీ బెంగళూరు రీజనల్ ఎటీఎం ప్రసాద్‌గౌడ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు నుంచి హైదరాబాద్ సహా అన్ని ప్రాంతాలకు వెళ్ళే లహరి ఏసీ స్లీపర్, ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సులలో బెర్తులపైనా రాయితీ వర్తిస్తుందన్నారు. హైదరాబాద్- బెంగళూరుల మధ్య నిత్యం వేలాది మంది ప్రయాణిస్తుంటారన్నారు. ఐటీ, బీటీ రంగాలతో పాటు విద్య, వ్యాపార రంగాలకు చెందిన వారు రెండు ప్రధాన నగరాల మధ్య సంచరించే వారికి అనుకూలంగా ఉంటుందనే రాయితీలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రస్తుతం పండుగల సీజన్ ఉందని దీనికి తోడు వేసవి సెలవుల వేళ రెండు రాష్ట్రాలలో పర్యాటక ప్రాంతాల సందర్శనలకు, సొంతూర్లకు వెళ్ళేవారికి రాయితీ అనుకూలం కానుందన్నారు. టికెట్‌లు ముం దుగా రిజర్వేషన్ చేసుకునే వెసలుబాటు ఉన్నట్లు ఎటీఎం ప్రసాద్‌గౌడ తెలిపారు.

మహిళా దినోత్సవానికి ప్రత్యేక ఆభరణాలు

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సహజ సిద్ధమైన వజ్రాల ఆభరణాల తయారీలో ఖ్యాతి గడించిన డి బీర్స్ ఫోర్‌వర్‌మార్క్ సంస్థ ప్రత్యేక కలెక్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. తల్లి, సోదరీమణులు, శ్రీమతికి కానుకగా అందజేసేందుకు వీలుగా ఈ ఆభరణాలను ప్రత్యేకంగా తీర్చిద్దినట్లు సంస్థ నగరంలో గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. అద్భుత కళానైపుణ్యానికీ ప్రతీకగా ఉన్న టిఎం ఆభరణాలు మహిళాదినోత్సవం అపురూప కానుకగా ఉంటాయని తెలిపింది. చూడగానే ఇట్టే ఆకట్టుకునే అద్భుతమైన డిజైన్లతో సహజసిద్ధమైన వజ్రాలు పొదిగిన ఈ ఆభరణాల కలెక్షన్‌ను తమ అన్ని షోరూమ్‌లలోనూ అందుబాటులో ఉంచామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ తమ ప్రకటనలో కోరింది.

74 భ్రూణహత్యల ఆసుపత్రి సీజ్

బెంగళూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నగర శివారు నెలమంగళలోని ఆశ్రయ ఆసుపత్రిలో భ్రూణహత్యలు నిర్ధారణ కావడంతో పోలీసులు గురువారం సీజ్ చేశారు. రామనగర్, మండ్య జిల్లాల పరిధిలో 74 భ్రూణహత్యలు జరిగిన వివాదంపై విచారణల జరుపుతుండగా ఆశ్రయ ఆసుపత్రి విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో వెంటనే రంగంలోకి దిగిన వైద్యశాఖాధికారులు, పోలీసులు ఆశ్రయ ఆసుపత్రిని పరిశీలించేందుకు వెళ్ళగా అప్పటికే నిర్వాహకుడు డాక్టర్ రవికుమార్ పరారీ అయ్యారు. భ్రూణ హత్యలు నిర్ధారణ కావడంతో ఆసుపత్రిని వైద్యాధికారులు సీజ్ చేశారు. డాక్టర్ రవికుమార్‌పై కేసు నమోదు చేశారు. పరారీలో ఉండే డాక్టర్ కోసం గాలింపులు సాగిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.



సీజ్ చేసిన ఆసుపత్రి ఇదే

నమో యువ భారత ఫెలోషిప్‌కు శ్రీకారం

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కొత్తనేతలను తెరపైకి తీసుకొచ్చే దిశలో రాష్ట్ర బీజేపీ యువమోర్చా 'నమో యువ భారత ఫెలోషిప్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బెంగళూరు మల్లేశ్వరంలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు ఈ సందర్భం గా పదాధికారులతో కలిసి ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. యువత రాజకీయాల్లోకి మరింతగా రావాలని చురుకైన పాత్రను పోషించాలన్నదే ప్రధాని మోదీ సంకల్పమన్నారు. కళాశాలల్లో స్టూడెంట్ యూనియన్ ఎన్నికలు జరగనందున యువత క్రమేపీ రాజకీయాలకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. నమో యువ భారత్ ఫెలోషిప్ కార్యక్రమం నెలన్నర పాటు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బివైవిజయేంద్ర సారధ్యంలో జరుగుతుందన్నారు. యువత నేడు సోషల్ మీడియాలో అత్యంత క్రియాశీలకంగా ఉం దని ఈ నేపథ్యంలో యువతకోసం ప్రత్యేకంగా రీల్స్ పోటీని ఏర్పాటు చేస్తున్నామని సోషల్ మీడియాలో అత్యంత ప్రజాదరణ గడించే టాప్ 10 రీల్స్ చేసిన వారికి ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యే అవకాశం లభిస్తుందన్నారు. మీడియా సమావేశంలో యువ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్యే హరీష్ పూంజా, ప్రధాన కార్యదర్శి సందీప్ రవి పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపి నేతలు

యాసిడ్ దాడి బాధితులకు ఇంటి స్థలాలు

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆసిడ్ అమ్మకాలను పూర్తిగా నిషేధించామని అయినా దొంగచాటుగా వీటిని కొందరు విక్రయిస్తున్నారని వీరిపై కఠిన చర్యలు తీసుకుంటామని హోం మంత్రి డా.జి.పరమేశ్వర ప్రకటించారు. బెంగళూరు పోలీస్ కమీషనర్ కార్యాలయంలో పరిహార సంస్థ సహకారంతో బుధవారం ఏర్పాటైన మహిళలపై దౌర్జన్యాలనియంత్రణ సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. ఆసిడ్ దాడికి పాల్పడే వారికి కఠిన శిక్షలుపడేలా చూస్తామని బాధితులకు ఉచితంగా ప్రభుత్వం తరుపున ఇళ్ళస్థలాలు ఇస్తామని, దాడులపై తక్షణం స్పందించాల్సిందిగా అధికారులకు సూచించారు



నూతనంగా ఎన్నికైన పదాధికారులు

కర్ణాటక రెడ్డిజన సంఘానికి నూతన పదాధికారులు

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కర్నాటక రెడ్డి జనసంఘానికి 2024-26 సంవత్సరాలకు గాను నూతన పాలకమండలిని నగరంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.శేఖర్‌రెడ్డి నగరంలో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంస్థ నూతన అధ్యక్షుడిగా ఎస్.జయరామ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా డి.ఎస్. లక్ష్మణరెడ్డి, కెఎన్.కృష్ణారెడ్డి, వి.వెంకట శివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎన్.శేఖర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎన్.సోమశేఖర్‌రెడ్డి, కెఆర్.నాగరాజ రెడ్డి, కోశాధికారిగా ఎం.చంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎఎం.శ్రీనివాసరెడ్డి ఎన్నికైనట్లు తెలిపారు.

హుక్కా నిషేధాన్ని సమర్థించుకున్న సర్కార్

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యసంరక్షణ దృష్ట్యా రాష్ట్రంలో హుక్కా వాడకాన్ని పూర్తిగా నిషేధించామని ప్రభుత్వం గురువారం హైకోర్టుకు తెలిపింది. హుక్కా నిషేధాన్ని సవాల్ చేస్తూ ఆర్.భరత్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ హైకోర్టులో గురువారం కూడా కొనసాగింది. రాష్ట్రప్రభుత్వం తరుపున అడ్వకేట్ జనరల్ కె.శశికిరణ్ శెట్టి తన వాదన వినిపించారు. యువత బంగారు భవిత దెబ్బతినకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతోనే హుక్కాబార్‌ను నిషేధించామని ఆయన కోర్టుకు తెలిపారు.

మాటలకందని విషాదం

● వేరుశనగ మిషన్‌లో పడి మహిళ మృతి

తాడిమర్రి, మార్చి 7: ఆ కుటుంబాన్ని విధి వెంటాడింది. చివరికి మాటలకందని విషాదాన్ని మిగిల్చింది. ఉన్న ఒక్క ఆధారాన్ని కూడా కబళించేసి ఉన్న వారికి తీరని అన్యాయం చేసింది. వివరాల్లోకి వెళితే.. శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలంలోని చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన పి.రమీజా(45) గురువారం సాయంత్రం ప్రమాదవ శాత్తూ మృతిచెందింది. ఆ మహిళే కుటుంబానికి జీవనాధారంగా ఉండేది. భర్త, కుమారుడు ఉన్నప్పటికీ వారు అనారోగ్య పరిస్థితులతో పనులకు వెళ్లలేని దుస్థితి. గతంలో రమీజా భర్త ఫక్రుద్దీన్ రోడ్డు ప్రమాదంలో గాయపడి పనులకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నాడు. ఇక 26 ఏళ్ల వయసు గల కుమారుడు బాషా బుద్ధిమాంద్యంతో బాధ పడుతున్నాడు. ఇద్దరు కుమార్తెలు ఉండగా.. వారికి వివాహాలు అయ్యాయి. కాగా పెద్ద కుమార్తె వన్నూరమ్మ భర్త 9 రోజుల క్రితం విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దీంతో కుటుంబ భారమంతా రమీజాపై పడింది. పొలం పనులు చేస్తూ వచ్చిన కూలి డబ్బులతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న ఆమెను కూడా మృత్యువు వెంటాడింది. రమీజా గురువారం అదే గ్రామానికి చెందిన కూలీలతో కలిసి వేరుశనగ కట్టెను మిషన్‌లో ఆడించేందుకు వెళ్లింది. పెద్దకోట్ల గ్రామం వద్ద వేరుశనగ కట్టెను ఆడించారు. మధ్యాహ్నం భోజనం కోసం మిషన్ ఆఫ్ చేసి ఆ తరువాత ప్రారంభించారు. ఆ సమయంలో రమీజా తన బ్యాగును ఇంజన్ వద్ద ఉంచేందుకు వెళ్లగా.. ప్రమాదవ శాత్తు చీర కొంగు మిషన్ రాడ్డుకు తగులుకుంది. రాడ్డుకు ఎలాంటి పరికరం అడ్డుగా లేకపోవడంతో రమీజాను లాగేసింది. దీంతో ఆమె మెడ భాగం నుజ్జునుజ్జు అయి చూడటానికి కూడా వీలులేకుండా మారింది. మిషన్ యజమాని వెంటనే మిషన్ ఆఫ్ చేశాడు. అప్పటికే ఆమె మృతిచెందింది. తాడిమర్రి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. అల్లుడు చనిపోయి 9 రోజులు కాగానే ఇప్పుడు రమీజా మృత్యువు పాలైంది. దీంతో అనారోగ్యంతో ఉన్న భర్త, కుమారుడికి, భర్తను పోగొట్టుకున్న కుమార్తె, ఆమె పిల్లలు దిక్కులేనివారయ్యారు. వరుస ఘటనలతో వారి కుటుంబం ఛిద్రమైంది. ఆ పేద కుటుంబానికి దేవుడు ఎందుకింత తిప్పలు పెడుతున్నాడోనని స్థానికులే కన్నీటి పర్యంతమయ్యారు.

ఎమ్మెస్సీ ఫలితాల విడుదల

అనంతపురం సెంట్రల్, మార్చి 7: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెస్సీ పరీక్షల ఫలితాలను విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఫిబ్రవరిలో ఎమ్మెస్సీ ప్రథమ, తృతీయ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు.

5, 8, 9, 11 తరగతుల బోర్డు పరీక్షలకు

హైకోర్టు బెంచ్ గ్రీన్‌సిగ్నల్

● ఏకసభ్య ధర్మాసనం ఆదేశాలు కొట్టివేత

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ గతంలో 5, 8 , 9 , 11 తరగతులకు బోర్డు పరీక్షలు జరుపాలని జారీ చేసిన ఉత్తర్వులు చెల్లుతాయని యథాప్రకారం పరీక్షల ఏర్పాట్లు చేసుకోవాలని హైకోర్టు డివిజనల్ బెంచ్ గురువారం తాజాగా తీర్పునిచ్చింది. ఈ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులను రద్దుచేస్తూ హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం బుధవారం ఇచ్చిన తీర్పుపై డివిజనల్ బెంచ్ స్టే మంజూరు చేసింది. హైకోర్టులో ఈ ఉత్తర్వులపై రెండు రోజులుగా తీవ్ర వాదోపవాదాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్‌చేస్తూ అన్ ఎయిడెడ్ ప్రయివేటు విద్యాసంస్థల సంఘం (రుప్సా) హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. ఈ పిటీషన్‌పై హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం న్యాయమూర్తి రవి హసమన బుధవారం ప్రభుత్వ ఉత్తర్వులను రద్దుచేస్తూ సంచలన తీర్పునిచ్చారు. దీనితో ఏకసభ్య ధర్మాసనం తీర్పునుసవాల్ చేస్తూ ప్రభుత్వం గురువారం డివిజనల్ బెంచ్ కు పిటీషన్ దాఖలు చేసింది. దాదాపు రెండు గంటలకు పైగా ఈ అంశంపై విచారణ జరిపిన హైకోర్టు డివిజనల్ బెంచ్ బుధవారం నాటి ఏకసభ్య ధర్మాసనం తీర్పుపై స్టే మంజూరుచేసింది. బోర్డు పరీక్షల నిర్వహణకు ప్రభుత్వానికి గ్రీన్‌సిగ్నల్ మంజూరు చేసింది. గత బీజేపీ ప్రభుత్వ హయాంలో అప్పటి విద్యాశాఖా మంత్రి బి.సి.నాగేశ్ 5, 8, తరగతులను పబ్లిక్‌పరీక్ష పరిధిలోకి తీసుకొస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రభుత్వం 9, 11 తరగతులను కూడా బోర్డు పరీక్షల పరిధిలోకి తీసుకొస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంటే ఈనాలుగు తరగతులు పబ్లిక్‌పరీక్షలుగా మారాయన్నమాట. విద్యాప్రమాణాలను మరింత మెరుగుపర్చే ఉద్దేశ్యంతోనే ఈ ఉత్తర్వులు జారీ చేశామని హైకోర్టు వీటికి గ్రీన్‌సిగ్నల్ మంజూరు చేయడం సంతోషంగా ఉందని ఉన్నత విద్యాశాఖా మంత్రి ఎంసి.సుధాకర్ గురువారం మీడియాకు తెలిపారు. కాగా హైకోర్టు డివిజనల్ బెంచ్ తాజా తీర్పును సుప్రీంకోర్టులో సవాల్‌చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు రుప్సా ప్రతినిధి ఒకరు నగరంలో మీడియాకు వెల్లడించారు.

